సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 25 । మార్చి । 2023



ఆహ్లాదానికి వేదికలు

అటవీ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎండీఏ మండలాల్లో ఏర్పాటు చేస్తున్న పార్కులు ఆహ్లాదం పంచుతున్నాయి.

- 9లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-54 (శనివారం ఉదయం)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36°/23°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్షయ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న నితిన్ అశోక్‌జాన్

బీబీనగర్ : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీబీనగర్ ఎయిమ్స్‌లో శుక్రవారం మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డీన్ ఎగ్జామినేషన్ వైద్యుడు నితిన్ అశోక్‌జాన్ క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే టీబీ రావడానికి గల కారణాలు, చికిత్సల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ వైద్యురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



వీధులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలోని 8వ వార్డులో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంగరెక్క స్వామి, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, జలీల్, శ్రీనివాస్, హరికిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

మోటకొండూర్ ఉప సర్పంచ్ తొలగింపు

మోటకొండూర్ : మోటకొండూర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్‌ను పదవి నుంచి తొలగించారు. ఉప సర్పంచ్‌పై ఫిబ్రవరి 1వ తేదీన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా 13మంది వార్డు సభ్యులకు గాను ఏడుగురు ఆయనకు వ్యతిరేకంగా చేతులు ఎత్తారు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వును ఎంపీడీఓ గ్రామ పంచాయతీ కార్యాలయానికి పంపారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సభా స్థలిని పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 31న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్న స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కె.అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ టీపిరెడ్డి మేఘారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాంపాక నాగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు బి.కళ్యాణ్‌చక్రవర్తి, పొన్నబోయిన రమేష్, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు కొండా సోంమల్లు, నాయకులు జంగ శ్రీను తదితరులున్నారు.

అంధత్వ నివారణే ధ్యేయం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి : అంధత్వ నివారణ ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పోచంపల్లిలోని చేనేత డైహౌజ్‌లో ఏర్పాటు చేసిన 12వ వార్డు కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ దేవరాయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, కుడికాల అఖిల బలరాం, బీఆర్‌ఎస్ నాయకులు సీత శ్రవణ్, దోర్నాల గణేశ్, గిరివాసు, వైద్యురాలు ఉమారాణి, క్యాంపు కోఆర్డినేటర్ గోపాల్‌రావు, ఆరోగ్యకార్యకర్తలు జానకి, ఆశాలు మమత, సువర్ణ, వజ్రమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

మరో అవకాశం!



ఇళ్లు నిర్మించుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు గడువు పెంపు

- ఏప్రిల్ 30 వరకు అవకాశం
- జీఓ 59 ప్రకారం మార్కెట్ విలువ పెంపు
- ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యం
- ప్రచారం చేయడానికి అధికారుల సన్నాహాలు

సాక్షి, యాదాద్రి : పేదలు, మధ్య తరగతి ప్రజలు ఇళ్లు నిర్మించుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఇందుకు సంబంధించిన జీఓలు 58, 59 కింద దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు పొడిగించింది. 58 జీఓ కింద ఉచితంగా క్రమబద్ధీకరించనుండగా, 59 జీఓ ప్రకారం మార్కెట్ విలువ పెంచారు.

ఆదాయమే లక్ష్యంగా..

జిల్లాలో పలువురు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇల్లు నిర్మించుకున్న స్థలం 120 గజాలకు మించితే మార్కెట్ ధర ప్రకారం డబ్బులు చెల్లించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసింది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు ఇంటి యజమాని పేరున ఇల్లు క్రమబద్ధీకరణ జరగనుంది. అయితే ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు వేలల్లో ఉన్నా చాలా మంది ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వం ఆశించిన మేరకు ఆదాయం వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.దీంతో దరఖాస్తు చేసుకోవడానికి మరోసారి గడువు పెంచింది.ఈసారి కూడా క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రాకపోతే ఇళ్ల యజమానులపై కేసులు నమోదు చేసే యోచనలో రెవెన్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

గత సంవత్సరం ఇలా..

58,59 జీఓల ప్రకారం క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువు గత సంవత్సరం మార్చి 31తో ముగిసింది. అయితే 16 మండలాల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. జీఓ 58 ప్రకారం 12, జీఓ 59 కింద ఐదు దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు. జీఓ 59 కింద చౌటుప్పల్‌లో ఒక్కరు మాత్రమే క్రమబద్ధీకరణకు చలాన్ చెల్లించారు. భూదాన్‌పోచంపల్లిలో ముగ్గురు, రాజాపేటలో ఒక్కరు చలాన్ కట్టకుండా జాప్యం చేస్తున్నారు.

క్రమబద్ధీకరించుకుంటే రూ.3 లక్షలు లబ్ధి

ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు లబ్ధి చేకూరనుంది. సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

సద్వినియోగం చేసుకోవాలి



ఇళ్లు నిర్మించుకున్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు గడువు పెంచింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీసేవలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఇళ్ల నిర్మాణం జరిగిన భూమి ఏ కేటగిరిలో ఉందన్న విషయాన్ని విచారణ చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేస్తాం. 59 జీఓ ప్రకారం ఇప్పటికే జిల్లాలో నాలుగు దఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి, రాజాపేటకు చెందిన లబ్ధిదారులకు స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించాం.

–శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్

120 గజాల లోపు ఉచితంగా..

క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీ వరకు మరోసారి అవకాశం కల్పించింది. 120 గజాల లోపు ఉన్న వారికి జీఓ 58 ప్రకారం ఉచితంగా, అంతకంటే ఎక్కువ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించాలని 59 జీఓలో నిబంధనలను సడలించారు. దీని ప్రకారం వచ్చిన దరఖాస్తులను అధికారులు విచారణ చేసి మార్కెట్ విలువ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయనున్నారు. తద్వారా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి యాజమాన్య హక్కులు లభించనున్నాయి. అయితే అప్పట్లో క్షేత్రస్థాయిలో ప్రచారం లేకపోవడంతో స్పందన కరువైంది. ఈసారి విస్తృతంగా ప్రచారం చేయనుంది.

● ఘనంగా సాక్షి వార్షికోత్సవం



సాక్షి 15వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి సిబ్బంది

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ పమేలా సత్పతి



గర్భిణులు, బాలింతలకు సూచనలు చేస్తున్న కలెక్టర్

చౌటుప్పల్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. చౌటుప్పల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభ, పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం అయ్యారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రాగులు, కొర్రలు, జొన్నలు, అరికెలు, సజ్జలు రోజువారీ ఆహారంలో తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. గర్భిణులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేర్లు నమోదు చేసుకొని రెండు చొప్పున టీటీ ఇంజెక్షన్లు వేయించుకోవాలని సూచించారు. నాలుగో నెల నుంచి ప్రసవం అయ్యే వరకు రోజుకు ఒకటి చొప్పున ఐరన్ మాత్ర వేసుకోవాలన్నారు. బిడ్డ ఎదుగుదల గురించి తెలుసుకునేందుకు గర్భిణులు భువనగిరి ఏరియా ఆస్పత్రిలోని టిఫా స్కానింగ్ సెంటర్‌లో పరీక్ష చేయించుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం కావడం ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, సీడీపీఓ శైలజ, మున్సిపల్ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, అంగన్‌వాడీ టీచర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని రక్షించేందుకే బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్లు, ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : దేశంలో రైతాంగాన్ని రక్షించడానికి కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీ గార్డెన్స్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కావాలని దేశ వ్యాప్తంగా ఉన్న రైతులు కోరుకుంటున్నారని చెప్పారు. హస్తినలో రైతులు చేసిన పోరాటాలు కేసీఆర్‌ను కదిలించాయన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్రంలో నిరంతరం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో నల్లగొండ జిల్లా అద్భుత ప్రగతిని సాధించని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. డీసీసీబీ పాలకవర్గం, ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి ప్రగతిపథంలో ముందుంచినందుకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గాన్ని, ఉద్యోగులను మంత్రి అభినందించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పురోగాభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని అభినందిస్తున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన మూడేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా రూ.2200 కోట్ల టర్నోవర్‌లో సాధించామని చెప్పారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎం వాహనాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్ రావును డీసీసీబీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య, నార్మాక్స్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోతె సోమిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆల్డా చైర్మన్ మొతె పిచ్చిరెడ్డి, సీఈఓ కె.మదన్‌మోహన్, డైరెక్టర్లు పాశంసంపత్‌రెడ్డి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలు ఇవే

భువనగిరి : జిల్లా ఉత్తమ గ్రామ పంచాయతీల వివరాలను శుక్రవారం పంచాయతీ అధికారులు ప్రకటించారు. తొమ్మిది విభాగాల నుంచి ఎంపిక చేశారు. ప్రతి విభాగం నుంచి 3 గ్రామ పంచాయతీల చొప్పున ఎంపికయ్యాయి.

విభాగాల వారీగా..

పేదరిక నిర్మూలన జీవనోపాధి విభాగంలో దండుమల్కాపురం (చౌటుప్పల్), కొలనుపాక (ఆలేరు), బీబీనగర్, ఆరోగ్య పంచాయతీలో ఇక్కుర్తి (మోటకొండూరు), మంతపురి (ఆలేరు), వాసాలమర్రి (తుర్కపల్లి), బాలల స్నేహపూర్వక విభాగంలో ఇంద్రపాలనగరం (రామన్నపేట), పహిల్వాన్‌పురం (వలిగొండ), మీట్‌తండా(బీబీనగర్) ఎంపికయ్యాయి. సరిపడా భూగర్భ జలవనరుల విషయంలో నమాత్‌పల్లి (భువనగిరి), ఎస్.లింగోటం (చౌటుప్పల్), గంగాపూర్ (గుండాల), పరిశుభ్రత పచ్చదనం ఎస్.లింగోటం(చౌటుప్పల్), జలాల్‌పూర్ (పోచంపల్లి), వడాయిగూడెం (భువనగిరి), సమగ్రమైన సమృద్ధి విభాగం వెల్లంకి(రామన్నపేట), రేణుకుంట (రాజాపేట), సంగెం(వలిగొండ), సామాజిక భద్రతలో అన్నంపట్ల(బీబీనగర్), దిలావర్‌పూర్ (మోటకొండూరు), జాల(రాజాపేట), సుపరిపాలనలో తాజ్‌పూర్(భువనగిరి), సాయినగర్(పోచంపల్లి),రామలింగంపల్లి(బొమ్మలరామారం) ఉన్నాయి.

మహిళల ఫ్రెండ్లీ విభాగంలో..

శివారెడ్డిగూడెం (పోచంపల్లి), రాఘవపురం(బీబీనగర్),మాదాపూర్(తుర్కపల్లి) ఎంపికయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఈ నెల 26న నల్లగొండ జిల్లా కేంద్రంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

దేశ చరిత్రలో చీకటి రోజు



నిరసన ప్రదర్శనలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

- రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడం దుర్మార్గం
- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం దేశ చరిత్రలో చీకటి రోజని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ భువనగిరిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధాని మోదీ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి, భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టన్నారు. ప్రధాని మోదీ, అమిత్‌షా నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని, ఇది జీర్ణించుకోలేని బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజల పక్షాన పోరాడే నాయకులు ఉండవద్దన్న దురుద్దేశంతో బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత పై కోర్టుకు వెళ్లేందుకు 30 రోజులు గడువు ఉన్నా రాహుల్ సభ్యత్వం రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. దేశ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌కుమార్, రవికుమార్, ఆదినారాయణ, శివనందర్, వెంకటేశం, జహంగీర్, శ్రీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల వినూత్న నిరసన



బస్వాపురం రిజర్వాయర్ వద్ద దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న లప్పానాయక్‌తండా వాసులు

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్‌తండా వాసులు చేపట్టిన దీక్ష తొమ్మిదో రోజు కొనసాగింది. శుక్రవారం వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తి కావస్తున్నా పరిహారం చెల్లించడం లేదన్నారు. మూడేళ్లవుతున్నా పునరావాస గ్రామంలో పనులు కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, బిచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి

భువనగిరిటౌన్ : వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.10వేల పరిహారం సరిపోదని, రైతులు ఎకరాకు రూ.40వేల పెట్టుబడి పెట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, పురుసోత్తం, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ ఒకే చోట!

చురుగ్గా సమీకృత మార్కెట్ పనులు

- రెండు ఎకరాల్లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణం
- పూర్తయితే ఒకే దగ్గర కూరగాయలు, మాంసం, పండ్లు, పూల విక్రయాలు
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం
- ట్రాఫిక్ సమస్యకూ చెక్



స్లాబ్ దశలో సమీకృత మార్కెట్ పనులు

అందరికీ ఉపయోగం



సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే ప్రజలతో పాటు వ్యాపారులకు ఎంతో ప్రయోజనం ఉటుంది. కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు ఒకే చోట లభ్యం కానున్నాయి.ప్రస్తుతం మార్కెట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిర్ణీత గడువు లోపు పూర్తి చేసి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. సమీకృత మార్కెట్ నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు.

–వస్పరి శంకరయ్య, మున్సిపల్ చైర్మన్, ఆలేరు

ఆలేరురూరల్ : మున్సిపాలిటీల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాంసం, కూరగాయలు, పండ్లు, పూలు ఒకే చోట విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమీకృత మార్కెట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్ల వ్యయంతో మార్కెట్ నిర్మిస్తున్నారు. పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం స్లాబ్ పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సమీకృత మార్కెట్ పనులను ఆగస్టులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.


మొత్తం 56 దుకాణాలు

ఆధునిక హంగులతో నిర్మించనున్న ఈ మార్కెట్‌లో వెజ్, నాన్ వెజ్, పండ్లు, పూల విక్రయాలకు ఒకే చోట దుకాణాలు రానున్నాయి. మొత్తం 56 దుకాణాలు నిర్మిస్తుండగా అందులో కూరగాయలకు 26, చికెన్, మటన్, చేపల కోసం 26, పండ్లకు 8, పూల విక్రయాలకు 4 దుకాణాలు కేటాయించనున్నారు. అదేవిధంగా మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు వాహనాలను పార్కింగ్ చేయడానికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం అందుబాటులో ఉండనుంది. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. కొనుగోలుదారులకు ధరలు తెలిసేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు సైతం అమర్చనున్నారు. ఈ సమీకృత మార్కెట్ అందుబాటులోకి వస్తే ఆలేరుతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన మంతపురి, ఇక్కుర్తి, శర్బనాపురం, మాటూరు, అమ్మనబోలు, దిలావర్‌పూర్, మోటకొండూర్ మండలం నుంచి నిత్యం ఆలేరుకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కూరగాయలు, మాంసం వ్యాపారులు హోల్‌సేల్‌గా, రిటేల్‌గా అమ్ముకునే సౌకర్యం కలగనుంది.

తొలగనున్న ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్య

వ్యాపారులు రోడ్ల పక్కనే కూరగాయలను విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వినియోగదారులు రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాటు వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేస్తుండడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యలన్నింటికీ చెక్ పడనుంది.

వ్యాపారులకు తీరనున్న ఇబ్బందులు



ఆలేరులో రోడ్డు పక్కన కూరగాయల దుకాణాలు

మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు రోడ్ల పక్కన కూరగాయలు విక్రయిస్తున్నారు. ఎండకు, వానకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం కూరగాయలు తడవడంతో కుళ్లిపోతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వినియోగదారులు మాంసం, కూరగాయలు కావాలంటే వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. సమీకృత మార్కెట్ నిర్మాణంతో వారి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.